నేరేడు పండు.. లాభాలు మెండు..

- కాయ నుంచి బెరడు వరకూ ఔషధ గుణాలు
- సర్వరోగ నివారిణి

రాజమహేంద్రవరం రూరల్: సీజన్ల వారీగా లభించే పండ్లు తినడం వల్ల శరీరానికి రోగాల నుంచి రక్షణ లభిస్తుందని, సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వైద్యులు చెబుతూ ఉంటారు. మన పూర్వీకులు ఈ విధానాలను పాటించడం వల్ల చాలా ఆరోగ్యంగా ఉండేవారు. ఇప్పుడిప్పుడే వీటిపై కూడా ప్రజలకు అవగాహన పెరుగుతోంది. ప్రస్తుతం అన్ని సీజన్ల పండ్లు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. రోడ్ల పక్కనే దుకాణాలలో చాలా సులభంగా దొరుకుతున్నాయి.

అల్ల నేరేడు పండ్లు

మన ఆరోగ్యానికి మేలు చేసే పండ్లలో అల్ల నేరేడు పండ్లు ఒకటి. ప్రస్తుతం వీటి సీజన్ నడుస్తోంది. రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటు పోషకాలను అందించే గుణం వీటికి ఉంది. నేరేడు పండ్లు కొంచెం తియ్యగా, వగరుగా ఉంటాయి. వీటిని జంబూఫలం, జామూన్‌గా కూడా పిలుస్తారు. నేరేడు పండ్లను ఆయుర్వేద శాస్త్రంలో అపర సంజీవనిగా పిలుస్తారు. వీటిలో విటమిన్ ఏ, సీ అధికంగా ఉంటాయి. ఆక్సాలిక్ ఆమ్లం ఒక ప్రత్యేకమైన రుచిని పండుకు అందిస్తుంది.



అమ్మకానికి సిద్ధం చేసిన అల్ల నేరేడు పండ్లు

కిలో రూ.250

మన జిల్లాతో పాటు చిత్తూరు, కృష్ణాజిల్లాల్లో నేరేడు పండ్లు ఎక్కువగా దొరుకుతాయి. అక్కడి నుంచి దిగుమతి చేసుకుని మార్కెట్‌లలో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం కిలో నేరేడు పండ్లను రూ.200 నుంచి రూ.250 వరకూ విక్రయిస్తున్నారు. మధుమేహం, రక్తహీనత, బీపీ, కిడ్నీ సమస్యలతో బాధపడేవారికి ఇవి ఔషధంగా పనిచేస్తాయని వైద్యులు చెబుతున్నారు. సహజ సిద్ధంగా దొరికే నేరేడు పండ్లలోని ఔషధ గుణం పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులకు మందులతో పనిలేకుండా మంచి ఫలితాన్ని ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు.

ప్రయోజనాలు ఇవే..

శరీరానికి అయ్యే గాయాలకు నేరేడు ఆకులను కట్టుగా కడితే రక్తం కారకుండా నిలుపుదల చేయవచ్చు. ఈ చెట్టు ఆకులు విషాన్ని కూడా పీల్చుకొనే గుణాన్ని కలిగి ఉంటాయి. పొట్టలోని నులి పురుగులను నేరేడు నివారిస్తుంది. నోటి కేన్సర్ నివారణకు కూడా ఎంతో దోహదపడుతుంది. మధుమేహ పీడితులకు నేరేడు పండు ఒక వరం. గింజలను పొడి చేసుకొని ప్రతిరోజు వాటిని నీటిలో మరగబెట్టి, వడకట్టి తాగితే శరీరంలో చక్కెర నిల్వలు అదుపులో ఉంటాయి. మూత్రాశయ సమస్యలకు టానిక్‌లా పనిచేస్తుంది. మూత్రం రాక ఇబ్బంది పడేవారికి ఉపశమనం కలుగుతుంది. నోటిపూత, చిగుళ్ల వ్యాధులు, దంతక్షయంతో బాధపడేవారు నేరేడు ఆకుల రసాన్ని రోజూ పుక్కిలించాలి. నోటిలో చిన్నపూతలు వచ్చినప్పుడు రెండు, మూడు నేరేడు పండ్లను తింటే వెంటనే మంట, బాధ నుంచి విముక్తి కలుగుతుంది. అతిసార రోగులకు సైతం ఈ పండ్లు చాలా మంచి ఔషధం. అయితే గర్భిణులు మాత్రం తినకూడదు.

ఎన్నో విశిష్టతలు

నేరేడు పండ్లను తినడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. శస్త్రచికిత్సలు అందుబాటులో లేని రోజుల్లో వైద్యానికి నేరేడు బెరడు, కాయలు, ఆకుల రసాన్ని ఎక్కువగా వినియోగించేవారు. నులి పురుగుల నివారణకు, షుగర్ నియంత్రణకు, నీళ్ల విరోచనాలు తగ్గడానికి నేరేడు పండు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– డాక్టర్ కేసీహెచ్ రమేష్, ఆయుర్వేద వైద్యనిపుణులు, ప్రభుత్వ బోధనాసుపత్రి, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

15న ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్వ్యూలు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 15వ తేదీన ఎంఎస్ఎన్ ల్యాబ్ క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. 2023 – 24 లో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీ (బ్రిడ్జి కోర్సు)తో పాటు పదో తరగతిలో 60 శాతం మార్కులు, ఇంటర్మీడియట్ ఒకేసారి పాసైన 20 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి కలవారు ఆ రోజు ఉదయం 9:30 గంటలకు తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

బియ్యం, నిత్యావసరాల వితరణ



బియ్యం, నిత్యావసరాలను అందజేస్తున్న మదనగోపాల్ దంపతులు

ప్రకాశం నగర్: దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలోని నడుస్తున్న కోటిలింగాల పేటలోని పందిరి మహదేవుడు కోటిలింగాల సత్రానికి వెంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదనగోపాల్, సీతా వెంకటలక్ష్మి దంపతులు బుధవారం రూ.55 వేలు విలువైన బియ్యం, నిత్యావసరాలు వితరణ చేశారు. ఈ సత్రంలో సుమారు 30 మంది విద్యార్థులు వేద విద్యను అభ్యసిస్తున్నారు. వారికి నెల రోజులకు సరిపడే నిత్యావసరాలను సత్రం సహాయ కమిషనర్ వి.వల్లంరాజుకు అందజేశారు.

పాఠశాలలు పరిశుభ్రంగా ఉండాలి



పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న సిబ్బంది

కడియం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలను తెరవనున్న నేపథ్యంలో ఆయా పాఠశాలల ఆవరణలు పరిశుభ్రంగా ఉండాలని ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని పలు పాఠశాలల్లో ఇప్పటి పారిశుధ్య పనులు చేపట్టడం జరిగిందన్నారు. వేమగిరి పంచాయతీ పరిధిలో మురుగునీటి సంపుల్లో పూడికతీత పనులు కూడా వేగంగా సాగుతున్నాయని తెలిపారు.

కూటమి నేతల సంబరాలు

కడియం: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, మంత్రిగా పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో కూటమి నేతలు సంబరాలు జరుపుకొన్నారు. మండల కేంద్రమైన కడియంలో మండల **టీడీపీ అధ్యక్షుడు**, ఉప సర్పంచ్ వెలుగుబంటి **నాని ఆధ్వర్యంలో** స్క్రీన్‌పై ప్రమాణ స్వీకార **కార్యక్రమం** ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు **చేశారు.** కడియపులంక రామాలయం సెం**టర్ వద్ద** టీడీపీ తెలుగు రైతు ఉపాధ్యక్షులు **మార్గాని** సత్యనారాయణ ఆధ్వర్యంలో సంబ**రాలు జరి**గాయి. ఈ సందర్భంగా ఆయా **పార్టీల కార్య**కర్తలు అభిమానులు భారీ **బాణసంచా** కాల్చారు. వేమగిరి, వీరవరం, దా**మిరెడ్డిపల్లి,** మురమండ, దుళ్ల, పొట్టిలంక **తదితర** గ్రామాల్లో సంబరాలు జరిగాయి.

సినిమాలు

శ్యామల	సత్యభామ
సూర్యమినీ	ముంజ్యా
సూర్యప్యాలెస్	బ్యాడ్‌బాయ్స్
స్వామి	భజే వాయువేగం
శివజ్యోతి	రక్షణ
అనుశ్రీ	మనమే
రాజా	బ్యాడ్‌బాయ్స్
ఊర్వశి	ఆ ఒక్కటీ అడక్కు
రంభ	లవ్‌మౌళి, ప్రేమిం
చొద్దు	
మేనక	బాక్
అప్సర	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి	గంగం గణేశా
నామవరం	
వీఎస్ మహల్	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, భజే వాయువేగం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కడియం	
వెంకటసూర్య : మనమే	

జక్కంపూడి చిన్ని సేవలు చిరస్మరణీయం



చిన్ని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముద్రగడ పద్మనాభం, చిత్రంలో జక్కంపూడి రాజా, ఆకుల వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సోదరుడు జక్కంపూడి శ్రీనివాసరావు (చిన్ని) మృతి కాపు ఉద్యమానికి తీరని లోటు అని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. స్థానిక నారాయణపురంలోని జక్కంపూడి చిన్ని కుటుంబ సభ్యులను బుధవారం ఆయన పరామర్శించారు. చిన్ని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చిన్ని కుటుంబానికి అండగా ఉంటానని కుమారుడు జక్కంపూడి రాహుల్ దత్తాకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కురుమళ్ల ఆంజనేయులు, అడపా వెంకట రమణ, మందారపు వీర్రాజు, లంక సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

కంబాలచెరువు: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎం.అనురాధ ఆధ్వర్యంలో బుధవారం కార్మిక, ఇతర శాఖలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నుంచి 14 ఏళ్ల వయసున్న పిల్లలు ఉచిత నిర్బంధ విద్య పొందడం వారికి రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ఈ వయసులో ఉన్న పిల్లలను కార్మికులుగా మార్చడం నేరమని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పిల్లల భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు, వ్యవస్థలు మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలందరికీ మంచి విద్య, స్వేచ్ఛగా జీవించే పరిస్థితులను కల్పించడం అందరి బాధ్యత అన్నారు. ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు టీఎస్ కార్తీక్, షేక్ జబీనా, గరల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.ఎస్తేర్ రాణి, డీసీపీవో పేనల్ లాయర్ ఎంపీ శేషమ్మ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీకి రంగం సిద్ధం



హెచ్ఎంలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న దిలీప్ కుమార్

కంబాలచెరువు: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించేందుకు సర్వం సిద్ధమైంది. ఈ సందర్భంగా అర్బన్ పరిధి లోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బుధవారం అర్బన్ అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ 94,270 పుస్తకాలు వచ్చాయని, ఇంకా 38,650 పుస్తకాలు అవసరమవుతాయన్నారు. స్టూడెంట్ కిట్‌కు సంబంధించి నోట్ పుస్తకాలు, బెల్టులు వచ్చాయని, బ్యాగులు, షూ, యూనిఫాం ఇంకా రావాల్సి ఉందన్నారు. పంపిణీ కార్యక్రమంలో సీఆర్పీలు, పార్ట్ టైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కంబాలచెరువు: విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రాజా బుధవారం డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత సీట్లు వచ్చినా ట్రిప్స్ ఇంటర్‌నేషనల్ స్కూల్, భారతీయ విద్యా భవన్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, లోరల్ హై, శ్రీ గౌతమీ, శ్రీచైతన్య తదితర స్కూళ్ల యాజమాన్యాలు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని ఆరోపించారు. దీనిపై అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఉచిత సీట్లు వచ్చిన విద్యార్థులకు వెంటనే స్కూళ్లలోకి ప్రవేశం కల్పించాలన్నారు. వెంటనే దీనిపై అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



శ్రీరామ్ మృతదేహం

రాజమహేంద్రవరం రూరల్: వ్యక్తి అనుమానాస్పద మృతిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన రెడ్డిపల్లి శ్రీరామచంద్ర మూర్తి ఎలియాస్ శ్రీరామ్ (35) లాలాచెరువు స్పిన్నింగ్ కాలనీలో నివసిస్తున్నాడు. ఇతడికి వీరలక్ష్మితో సుమారు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు సంతానం లేకపోవడంతో మూడేళ్ల క్రితం బంధువుల అమ్మాయి శ్రీలియాను దత్తత తీసుకున్నారు. కాగా.. శ్రీరామ్ ఏడాది క్రితం యమహా షోరూంలో పనిచేస్తున్నప్పుడు కస్టమర్‌గా వచ్చిన శాటిలైట్ సిటీ ఇందిరమ్మ కాలనీకి చెందిన గొండేపి దేవితో పరిచయం ఏర్పడింది. ఆమె ఇంటి దగ్గరే అతడు ఎక్కువగా ఉండేవాడు. ఆరు నెలల క్రితం భార్య వీరలక్ష్మి వద్దకు వచ్చి, 20 రోజులు ఉండి వెళ్లిపోయాడు. కాగా.. శ్రీరామ్ జాంపేటలో పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. వారం రోజుల క్రితం తన బంధువైన రెడ్డిపల్లి లక్ష్మణమూర్తి ద్వారా భార్య వీరలక్ష్మికి ఫోన్ చేసి వీడియో కాల్ మాట్లాడారు. తన షాపు వద్దకు రావాలని భార్యను కోరాడు. దీంతో వీరలక్ష్మి పాన్‌షాప్ వద్దకు వెళ్లగా శ్రీరామ్ కాళ్లకు, తలకు రక్తపు గాయాలు కనిపించాయి. ఏమైందని ఆమె ప్రశ్నించగా బండిపై నుంచి పడిపోయానని చెప్పాడు. దీంతో వీరలక్ష్మి తన భర్త శ్రీరామ్‌కు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించింది. అప్పటి నుంచి ఆమె వద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి వరకూ శ్రీరామ్ ఇంటికి రాలేదు. అతడికి ఫోన్ చేసినా మాట్లాడలేదు. దీంతో గొండేపి దేవి వద్దకు వెళ్లిపోయాడనుకుని వీరలక్ష్మి ఊరుకుంది. అయితే బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఆమెకు ఫోన్ వచ్చింది. డీటీసీ నుంచి శ్రీరామపురం వెళ్లే రోడ్డుతో శ్రీరామ్ మృతి చెందాడని దాని సమాచారం. వీరలక్ష్మి అక్కడకు వెళ్లి చూడగా శ్రీరామ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై ఆర్.అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విత్తనాలు, ఎరువులు సిద్ధం

పెదపూడి: మండలంలో రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. ఆయన బుధవారం పెదపూడిలో మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో విత్తనాలు, ఎరువులు ఉన్నాయన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి స్వర్ణ రకం విత్తనాలు ఉన్నాయన్నారు. ఇతర రకాల విత్తనాలు మండలంలో లైసెన్స్ పొందిన షాపుల్లో ఉన్నాయన్నారు.

హెల్త్ క్లినిక్ శిలాఫలకం ధ్వంసం



గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన వంగలపూడిలోని వైఎస్సార్ క్లినిక్ శిలాఫలకం

సీతానగరం: వంగలపూడిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ శిలా ఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు కొంచ చంద్రభాస్కరరావు బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీలకు గెలుపు ఓటములు సహజమన్నారు. శిలాఫలకాలను ధ్వంసం చేసే విష సంస్కృతి మన ప్రాంతానికి తీసుకురావద్దని హితవు పలికారు.

నాట్లకు ప్రత్యామ్నాయం..
దిగుబడి అధికం

- వెదజల్లు, డ్రమ్ముసీడర్ పద్ధతితో ఎంతో మేలు
- పెట్టుబడి తక్కువ
- రైతులకు వ్యవసాయాధికారుల అవగాహన



డ్రమ్ము సీడర్‌తో విత్తనాలు నాటే పద్ధతి



డ్రమ్ము సీడర్ ద్వారా విత్తిన పొలంలో మొలకెత్తిన వరి

సీతానగరం: రబీ సీజన్ దాదాపు పూర్తయ్యింది. ఖరీఫ్ సాగుకు రైతులు సన్నాహాలు ప్రారంభిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో అక్కడక్కడా వేసవి దుక్కులు కూడా చేశారు. నైరుతి రుతుపవనాల రాకతో సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంది. సాధారణంగా నాట్లు వేసే పద్ధతిలోనే వరి సాగు జరుగుతుంది. ముందుగా నారుపోసి, ఆ తర్వాత కూలీలతో నారును నాటిస్తారు. అయితే నారుమడికి నీరు చాలా అవసరం. అలాగే కూలీల ఖర్చు ఎక్కువ. ఈ నేపథ్యంలో కూలీల కొరత, అధిక రేట్లను తగ్గించుకునేందుకు వరిసాగులో వెదజల్లు పద్ధతి మంచి ప్రత్యామ్నాయమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దీనిలో రెండు రకాలు ఉన్నాయి. దమ్ము చేసిన పొలంలో నేరుగా విత్తనాలను చల్లుకోవచ్చు. అలాగే డ్రమ్ము సీడర్‌తో విత్తనాలు క్రమపద్ధతిలో నాటవచ్చు.

వెదజల్లు విధానం

వెదజల్లు విధానాన్ని పాటించే రైతులు మే నుంచి జూలైలో వర్షాలు పడుతున్నప్పుడు భూమిని బాగా దున్నుకోవాలి. దమ్ము చేసిన పొలంలో విత్తనాలను నాటడానికి 4, 5 రోజుల ముందు మరోసారి దమ్ము చేసి ఎత్తు పల్లాలు లేకుండా చదును చేయాలి. అలాగే మురుగునీరు పోయేటట్లు కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. ఆయా ప్రాంతాలకు అనువైన రకాలను ఎంపిక చేసుకోవాలి. ఎకరానికి 10, 15 కిలోల వరి విత్తనాలను నేరుగా చల్లుకోవచ్చు. డ్రమ్ము సీడర్‌తో విత్తనాలను నాటేటప్పుడు క్రమపద్ధతిలో పడతాయి. వెదజల్లే పద్ధతిలో నైపుణ్యం గల కూలీలలో విత్తనాలను చల్లించాలి.

విత్తన శుద్ధి, నీటి యాజమాన్యం

ప్రతి రైతూ తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి. లీటర్ నీటికి ఒక గ్రాము కార్బండైజిమ్ కలిపి, ఆ ద్రావణంలో కిలో విత్తనాలను 24 గంటలు నానపెట్టాలి. ఆపై కొద్దిగా ముక్కులు (కోర) పగిలే వరకు మండె కట్టాలి. ఈ విత్తనాలను దమ్ము చేసిన పొలంలో చల్లాలి. నారుమడుల్లో పాటించినట్టుగానే నీటి యాజమన్య పద్ధతులు పాటించాలి. ప్రాంతాల వారీగా నాట్లు వేసి సాగు చేసే వరికి సిఫారసు చేసిన ఎరువులనే వెదజల్లే పద్ధతితోనూ వేసుకోవాలి.



దమ్ము చేసిన పొలంలో వరి విత్తనాలు చల్లుతున్న రైతు

కలుపు యాజమాన్యం

వెదజల్లు పద్ధతిలో పొలాల్లో కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. విత్తిన 3, 5 రోజుల మధ్య ఆక్సాడయార్జిల్ 80 శాతం (టాప్‌స్టార్) 35 గ్రాములు లేదా పెట్లిక్లోర్, సేఫనర్ (సోఫిట్స్) 500 మిల్లీలీటర్లు, అఏదా అనిలోఫాస్ 500 మిల్లీ లీటర్లు 25 కిలోల ఇసుకలో కలిపి పొలంలో పలుచగా నీరుంచి, సమానంగా వెదజల్లుకోవాలి.

డ్రమ్ము సీడర్‌తో..

కొద్దిగా కోర వచ్చి మొలకెత్తించిన వరి విత్తనాలను డ్రమ్ము సీడర్ డబ్బాలలో పోసి దమ్ము చేసి చదునుగా ఉన్న మడిలో పెట్టి ముందుకు లాగాలి. ఎకరానికి 10 నుంచి 12 కిలోలు విత్తనం సరిపోతుంది. ఇద్దరు వ్యక్తులు డ్రమ్ము సీడరు ద్వారా మూడు గంటలలో ఎకరం పొలంలో విత్తనాలను విత్తవచ్చు. సాళ్ల మధ్య 20 సెంటీమీటర్ల ఎడం ఉంటుంది. విత్తనం విత్తేటప్పుడు పొలంలో బురద పదును ఉండి నీరు పలుచగా ఉండాలి. కలుపు నివారణకు తప్పని సరిగా రసాయన మందులు వాడాలి.

ఎన్నో ప్రయోజనాలు



డ్రమ్ము సీడర్ ద్వారా విత్తనాలు చల్లినప్పుడు నాట్లు క్రమపద్ధతిలో పడతాయి. మడిలో సూర్యరశ్మి, గాలి బాగా తగిలి, చీడపీడల బెడద ఉండదు. కలుపు తీతకు, ఎరువులు, పురుగు మందులు చల్లేందుకు వీలుగా ఉంటుంది. నాటిన విత్తనం భూమిపై తక్కువ లోతులో మొలకెత్తడం వలన వేర్లు బాగా అభివృద్ధి చెందుతాయి. పైరుకు ఇచ్చే పోషక పదార్థాలను సక్రమంగా వినియోగించుకుంటాయి. ఒక్కో దుబ్బులో ఎక్కువ పిలకలతో మంచి వెన్నులు వేసి అధిక దిగుబడికి అవకాశం ఉంటుంది.

– సూరెడ్డి జితేంద్రనాథ్, విశ్రాంత సేద్య పంటల అధికారి, రాజమహేంద్రవరం

విషం తాగి యువతి మృతి

కంబాలచెరువు: పోలవరం మండలం తోటగొందికి చెందిన మిడియం రాజ్యలక్ష్మి (21) విషం తాగి బుధవారం మృతి చెందింది. ప్రకాశం నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్యలక్ష్మి తన స్నేహితురాలి ఇంటిలో ఫంక్షన్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఈ నెల 10వ తేదీన ఇంటి నుంచి బయలుదేరింది. అదే రోజు సాయంత్రం రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం నుంచి తన తల్లి వరలక్ష్మికి ఫోన్ చేసి తనకు వాంతులు అవుతున్నాయని తెలిపింది. వెంటనే తల్లి రాజమహేంద్రవరంలోని తెలిసిన వ్యక్తికి ఫోన్ చేసి విషయం చెప్పింది. అతడు కాంప్లెక్స్‌కు చేరుకుని రాజ్యలక్ష్మిని ఆసుపత్రికి తరలించాడు. అక్కడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసులు ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజ్యలక్ష్మి విషం తాగడం వల్ల మృతి చెందినట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు.

గోదావరిలో ఉద్యోగి మృతదేహం

కంబాలచెరువు: విజయవాడకు చెందిన పంచాయతీ రాజ్ ఉద్యోగి సుంకర వెంకట రమణారావు (62) మృతదేహం బుధవారం గోదావరిలో లభ్యమైంది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంచాయితీరాజ్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసే రమణారావు ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదని అతడి కుటుంబ సభ్యులు విజయవాడలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా.. గోదావరిలో మృతదేహం తేలియాడుతోందని తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నదిలోంచి మృతదేహాన్ని వెలికి తీసి ఆధారాల కోసం వెతకగా రమణారావుగా తేలింది. దీంతో పోలీసులు విజయవాడ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.